www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 అక్టోబర్ 2023



సురక్షిత తాగునీరు అందించండి : సిపిఎం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు రక్షిత తాగునీటి చెరువుల్లో నీటిని శుద్ధిచేసి ప్రజలకు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ లక్ష్మణేశ్వరం చెరువు ఫిల్టర్ బెడ్లు పాడైన కారణంగా చాలా రోజులుగా కుళాయిల్లో కలుషిత నీరు వస్తుందన్నారు. మండలంలో మెజార్టీ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేసి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, కమిటీ సభ్యులు గుత్తుల శ్రీరామచంద్రుడు, కవురు శ్రీనివాస్, గుబ్బ నాగేశ్వరరావు, వాటాల ధనుంజయ పాల్గొన్నారు.

లోటు వర్షపాతం..!




ముగిసిన వానాకాలం
జులైలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు
మూడునెలలు సరిగా పడని వర్షాలు
భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం
ఆందోళనలో మెట్టప్రాంత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈ ఏడాది సరిపడు వర్షాలు పడకుండానే వానాకాలం ముగిసింది. నాలుగు నెలల వర్షాకాలంలో ఒక్కనెలలో మాత్రమే సాధారణ వర్షం కురవడంతో లోటు వర్షపాతం ఏర్పడింది. ప్రస్తుతం పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ లోటువర్షపాత ప్రభావం రానున్న కాలంలో మెట్టప్రాంతంలో తీవ్రంగా పడుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.13 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేపట్టారు. వర్షాలు సరిగా పడకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాంతం కావడంతో వర్షాలు తక్కువగా పడినప్పటికీ కాలువల ద్వారా గోదావరి నీరు వస్తుండటంతో ఖరీఫ్‌సాగుకు పెద్దగా ఇబ్బందిలేదు. మెట్టప్రాంతంలో పరిస్థితి పూర్తిభిన్నంగా ఉంది. ప్రాజెక్టుల కింద కొంతమేర సాగు ఉన్నప్పటికీ అత్యధికంగా మోటారు బోర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాభావంతో మెట్టప్రాంతంలోని చెరువులు అడుగంటడంతోపాటు, భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో లోటువర్షపాత ప్రభావం వచ్చే రబీలో తీవ్రంగా చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ నాలుగ నెలలు కురిసే వర్షాల ఆధారంగానే మెట్ట ప్రాంతలో చెరువుల నీటిమట్టాలు, భూగర్భజలాలు పెరగడం వంటివి జరుగుతాయి. నీటిమట్టాలు పెరిగితే బోర్లు భాగా పనిచేసి రబీలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ఈ ఏడాది జూన్‌లో సరాసరిగా 112.5 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 86.3 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. దీంతో 23.3 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు ఏర్పడింది. జులై నెలలో 242.9 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 319.8 మిల్లీ మీటర్లు కురవడంతో 31.7 మిల్లీమీటర్ల వర్షం అదనంగా పడింది. ఆగస్టులో 212.4 మిల్లీమీటర్ల వర్షపాతం పడాల్సి ఉండగా 90.9 మిల్లీమీటర్లు వర్షం మాత్రమే పడటంతో 57.2 మిల్లీమీటర్ల వర్షపాతలోటు ఏర్పడింది. సెప్టెంబర్‌లో 171.5 మిల్లీ మీటర్లకు 137 మిల్లీమీటర్లు పడటంతో 20.1 మిల్లీమీటర్ల వర్షపాత లోటు ఏర్పడింది. వానలు సరిగా కురవకపోవడంతో మెట్టప్రాంతంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు. పోలవరం, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల మండలాల్లో వర్షం భారీగా తక్కువ పడింది. దీంతో ఆయా మండలాల్లో చెరువులు అడుగంటాయి. దీంతో పశువులకు సైతం తాగునీటి ఇబ్బందులు ఏర్పడిందని చెబుతున్నారు. వర్షపాతం లోటుతో వచ్చే రబీలో తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోర్ల నుంచి నీరు సరిగా వచ్చే పరిస్థితి ఉండదు. అదే జరిగితే సాగునీరు అందక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లోనూ చింతలపూడి, ద్వారకాతిరుమల, పోలవరం, కొయ్యలగూడెం వంటి అనేక మండలాల్లో పంటలపై తీవ్ర ప్రభావం పడనుంది. వర్షాలు సరిగా కురవకపోవడంతో డెల్టాలో సైతం పంటలు ఏపుగా పెరగకపోవడం, తెగుళ్ల సోకడం వంటి సమస్యలున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షపాతం లోటుతో వచ్చే సమస్యలను ప్రభుత్వం ఏవిధంగా పరిష్కరిస్తుందో వేచిచూడాల్సి ఉంది.

నాలుగునెలల వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

నెల	కురిసిన వర్షం	కురవాల్సిన వర్షం	లోటువర్షపాతం
జూన్	86.3	112.5	-23.3
జులై	319.8	242.9	ప్లస్31.7
ఆగస్టు	90.9	212.4	-57.2
సెప్టెంబర్	137	171.5	-20.1


గ్రంధికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ప్రభుత్వ విప్‌గా ఎంఎల్‌ఎ గ్రంధి

కేబినెట్ సహాయ మంత్రి హోదా కల్పించిన ప్రభుత్వం
భీమవరం వైసిపి శ్రేణుల్లో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గ్రంధికి కేబినెట్ సహాయ మంత్రి హోదాను ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో భీమవరం వైసిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ప్రభుత్వ విప్‌గా ఆయన నియామకం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ఆయనను అభినందనలతో ముంచెత్తారు. భీమవరం రాజకీయ చరిత్రలో గ్రంధికి ప్రత్యేకస్థానం ఉంది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై గెలుపొందడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు మార్మోగింది. జనసేన అధినేతపై గెలుపొందడంతో ఆయనకు మంత్రి పదవి ఖాయమని అప్పట్లో ప్రచారం సాగింది. కానీ సామాజిక వర్గ సమీకరణాల కారణంగా ఆ పదవి అందుకోలేకపోయారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడి ఆరంభమవుతున్న తరుణంలో ఆయనకు కేబినెట్ సహాయ మంత్రి హోదా కలిగిన విప్ పదవి వరించడం విశేషం.

మంత్రి పదవి కన్నా జిల్లా కేంద్రమే ముఖ్యమన్న గ్రంధి

జిల్లాల పున:వ్యవస్తీకరణలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు ఏర్పడ్డాయి. భీమవరం జిల్లా కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లాను ఏర్పాటు చేశారు. తొలుత జిల్లాకేంద్రం నరసాపురంను ప్రతిపాదించేందుకు చర్యలు చేపట్టారు. అయితే ఈ సమయంలో గ్రంధి తనకు మంత్రి పదవి కన్నా భీమవరం జిల్లా కేంద్రం కావడమే ముఖ్యమని చెప్పి జిల్లాకేంద్రం సాధనకు విశేష కృషి చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కీలక తరుణంలో గ్రంధికి విప్ పదవి కేటాయించడం పట్ల చర్చ సాగుతుంది. రాజకీయ సమీకరణలో భాగంగా భీమవరంలో ప్రధాన పార్టీలను ఎదుర్కొనే వ్యూహంలో భాగంగానే సహాయ మంత్రి హోదాను కట్టబెట్టారనే ప్రచారం సాగుతుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలపై జనసేన, టిడిపి కూటమి పట్టు బిగిస్తున్న తరుణంలో టిడిపికి బలమైన బిసి ఓట్ బ్యాంకు ఉండగా, జనసేన పార్టీ ప్రధానంగా కాపు సామాజిక తరగతి ఓట్లపై దృష్టి సారించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. జనసేన, టిడిపి వ్యూహాలను చిత్తుచేసే క్రమంలో గ్రంధికి ఈ పదవిని కేటాయించినట్లు ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. బిసి, కాపు సామాజిక తరగతుల ఓట్లను గెలుచుకునే సత్తా గ్రంధికి ఉందని, వచ్చే ఎన్నికల్లో వైసిపి మరింత బలపడుతుందని వారు అంచనా వేస్తున్నారు.

కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం

సంప్రదాయ చేపల వేటకు చర్యలు
కొల్లేరు కాలుష్యాన్ని అరికడతాం
ఆరు నెలల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం
కైకలూరు ఎంఎల్‌ఎకు, ఆయన కొడుకుకు బుద్ధి చెబుతాం
అదేపోలీసులతో సమాధానం చెబుతాం
ముదినేపల్లి సభలో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ముదినేపల్లి

'కొల్లేరులోని 52 మత్స్యకార సంఘాలను వైసిపి నిర్వీర్యం చేసింది.. రోడ్లు గానీ, తాగునీటి సమస్యగానీ పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. టిడిపి, జనసేన కూటమి అధికారంలోకొచ్చాక కొల్లేరు ప్రజలకు అండగా ఉంటాం. సంప్రదాయ చేపల వేటకు అవసరైన చర్యలు చేపడతాం. మత్స్యకార సంఘాలకు అండగా ఉంటాం' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి యాత్రలో భాగంగా శుక్రవారం పవన్ ఏలూరు జిల్లాలోని ముదినేపల్లిలో పర్యటించారు. ముందుగా మచిలీపట్నం నుంచి బయలుదేరి ఆయన పెడన, బంటుమిల్లి మీదుగా ముదినేపల్లి చేరుకున్నారు. దారిపొడవునా పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం లభించింది. సాయంత్రం ముదినేపల్లిలో జరిగిన బహిరంగసభలో పవన్ మాట్లాడారు. ఒకపక్క 175 సీట్లు వస్తాయంటూ చెబుతున్న వైసిపి జనసేనను చూసి భయపడుతుందన్నారు. తాము ఎన్‌డిఎలో ఉంటే వారికేంటి లేకపోతే ఏంటి అని ప్రశ్నించారు. మరో ఐదునెలల్లో తేలుస్తామన్నారు. తెలంగాణ ఎన్నికలతో వెళ్లినా తామేంటో తేలుస్తామని చెప్పారు. 2009లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని ఎదుర్కొని నిలబడ్డానని, తమకు భయపడేవాళ్లం కాదన్నారు. 2014లో టిడిపి, బిజెపికి మద్దతిచ్చామని తెలిపారు. కైకలూరులో జనసైనికులను ఇబ్బంది పెడుతున్నారని, ఎస్‌సి, ఎస్‌టి కేసులు సైతం పెడుతున్నారని, వాటికి తగిన సమాధానం చెబుతామన్నారు. రూ.14 కోట్లతో పెద్దింట్లమ్మ గుడికి వంతెన నిర్మించలేకపోయారని వైసిపిని విమర్శించారు. కైకలూరు ఎంఎల్‌ఎ, ఆయన కొడుకు దౌర్జన్యాలు చూస్తు ఊరుకోబోమని, భవిష్యత్తులో దెబ్బకు దెబ్బ చూపిస్తామన్నారు. పోలీస్ స్టేషన్లలో సెటిల్‌మెంట్‌లు చేస్తున్నారన్నారు. అదే పోలీసులతో మక్కెలు విరగకొట్టిస్తామన్నారు. కొల్లేరు ప్రజలకు టిడిపి, జనసేన కూటమి న్యాయం చేస్తుందన్నారు. రోడ్లు వేయరు, బ్రిడ్జిలు కట్టరు గానీ, ప్రశ్నించిన వారిపై కేసులు మాత్రం పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకొచ్చాక కొల్లేరు పరిధి మొత్తం ప్రజలకు చూపిస్తామన్నారు. కలిదిండిలో రోడ్డు వేయలేదని, వినాయక చవితి లడ్డూ పాట సొమ్ముతో రోడ్డు వేసుకుంటామంటే ఎంఎల్‌ఎ అడ్డుపడటం సిగ్గుచేటన్నారు. ముదినేపల్లి మండలంలో ఆరువేల మందికి తాగడానికి నీళ్లలేవని వినితి ఇచ్చారన్నారు. వాటర్‌ప్లాంట్‌లో శుద్ధిచేసే వ్యవస్థ లేదని, కిడ్నీలు దెబ్బతింటున్నాయని జనం చెబుతున్నారన్నారు. టిడిపి, జనసేన కూటమి వచ్చిన ఆరునెలల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. పంచాయతీ నిధులను కాజేస్తే పనులు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. ఉదయం పథకం కింద డబ్బులు.. సాయంత్రం మద్యం పేరుతో దోపిడీ ఇదే రాష్ట్రంలో జరుగుతుందన్నారు. ఆడపడుచులు కోరుకుంటే ఆయా గ్రామాల్లో మద్యం నిషేధిస్తామన్నారు. అధికారంలోకొచ్చిన నెలరోజుల్లో మద్యం ధరలు తగ్గించి పాతధరలు అమలుచేస్తామన్నారు. కొల్లేరు కాంటూరు లెక్కలు జగన్‌కు తెలియవన్నారు. కొల్లేరులోకి 567 డ్రెయిన్ల నుంచి 17 వేల టన్నుల కాలుష్యం కలుస్తుందన్నారు. కాలుష్యాన్ని శుద్ధి చేసే కార్యక్రమాలు చేపడతా మన్నారు. కైకలూరును నగరపంచాయతీ చేయలేక పోయారని, తాము అధికారంలోకొచ్చాక మినీపట్టణంగా మారుస్తామన్నారు. ఆక్వా రైతులకు అండగా ఉంటామన్నారు. 2021లోనే ఓట్లు చీలని వ్వనని చెప్పాననని, అదేమాటకు కట్టుబడి ముందుకు సాగుతు న్నామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం


అనమెలీస్ ఓటర్లను పకడ్బందీగా పున్ణపరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నియోజకవర్గాల ఎన్నికల ప్రత్యేక అధికారులతో సమావేశమై ఒకే ఇంట్లో పది మంది ఓటర్ల కంటే ఎక్కువగా ఉండడం, వంద సంవత్సరాల దాటిన వ్యక్తులు, జీరో డోర్ నంబర్‌తో ఉన్న జంక్ ఓటర్ల జాబితాలను పున్ణపరిశీలన చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2,914 గృహాలకు సంబంధించి 38,006 అనమెలీస్ జాబితాను తనిఖీ చేయాల్సి ఉండగా, వాటిలో ఇప్పటికే 10,258 ఓటర్లకు సంబంధించి ఫామ్ 7, 8లను తీసుకున్నట్లు తెలిపారు. మిగిలిన అనమెలీస్ వివరాలను మండలాలు వారీగా క్రోడీకరించుకొని రాండమ్‌గా చెక్ చేయాలని తెలిపారు. డూప్లికేట్, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన ఓటర్స్, డెత్ ఓటర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సుమోటో అడిషన్స్, డిలీషన్స్ చేయకూడదన్నారు. ఎలక్ట్రోల్ రోల్‌లో అప్‌డేట్ చేయాల్సినవి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనమెలీస్, జంక్ క్యారెక్టర్స్ వాటిని ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రత్యేక అధికారులు జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, జిల్లా పరిశ్రమల అధికారి వి.ఆదిశేషు, జిల్లా కోపరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి ఆశాకిరణ్, జిల్లా వికలాంగుల శాఖ అధికారి జిసి హెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళా, కార్మిక వ్యతిరేకి బిజెపిని గద్దెదించాలని, మహిళా రిజర్వేషన్ చట్టం తక్షణం అమలు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యాన ఢిల్లీలో గురువారం ర్యాలీలో పాల్గొన్న పశ్చిమ గోదావరి జిల్లా ఐద్వా నేతలు



అవినీతికి కేరాఫ్ చంద్రబాబు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు


ప్రజలకు బ్రోచర్ అందజేస్తున్న పివిఎల్

పాలకోడేరు :చంద్రబాబు నాయుడు అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని అందుకే జైలు పాలై నెల రోజులవుతున్నా బెయిల్ రాలేదని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు విమర్శించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం పాలకోడేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ సంక్షేమ బ్రోచర్లను అందజేసి మాట్లాడారు. తప్పుచేసి అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడు తన తప్పును సమర్థించుకోవడం కోసం, సానుభూతి కోసం పాకులాడుతున్నారన్నారు. జగన్ నిజాయతీపరుడు కాబట్టే ఏ ఒక్క కేసు కూడా రుజువు కాలేదన్నారు. ప్రతి పేదవాడి అభివృద్ధి కోసం శ్రమిస్తున్న నేతగా ముఖ్యమంత్రి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి

తణుకు ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

పట్టణంలోని 150 పడకల జిల్లా ప్రభుత్వాసుపత్రి స్థాయికనుగుణంగా 120 మంది పారిశుధ్య కార్మికులను నియమించాలని ఎపి మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. గురువారం తణుకులో ప్రభుత్వాసుపత్రి వద్ద మెడికల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ 40 పడకలగా ఉన్న తణుకు ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మారుస్తూ 150 పడకలకు విస్తరించినట్లు తెలిపారు. విస్తరణలో భాగంగా అనేక నూతన భవనాల నిర్మాణం జరిగినప్పటికీ 40 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పుడు నియమించిన 18 మంది పారిశుధ్య కార్మికులతోనే నేటికీ పనులు చేయిస్తున్నారన్నారు. దీంతో కార్మికులపై తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. పెరిగిన పనిభారంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఆసుపత్రి స్థాయికనుగుణంగా 120 మంది పారిశుధ్య కార్మికులను నియమించి, కార్మికుల పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. రెండు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, జిఒ 549 ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.16 వేలు, జిఒ 43 ప్రకారం సెక్యూరిటీ సిబ్బందికి రూ.12 వేల వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే ప్రతి నెలా పేస్లిప్పులు ఇవ్వాలని, పిఎఫ్ ప్రతి నెలా సక్రమంగా జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.వెంకటలక్ష్మి, వై.రత్నం, వి.సూరమ్మ, ఇ.హైమావతి, టి.భారతి, వెంకట రత్నం, పి.రేణుక, చోళ్ల మంగమ్మ, ఎం.బేబి, పి.విజయలక్ష్మి, డి.చిన్నా, ఎన్.చింతాలు, డి.సాయికుమారి, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

టిడిపి నేతల వినూత్న నిరసన


ఆచంటలో వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు విమర్శించారు. ఎంఎల్‌ఎ రామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో తెలుగు యువత వినూత్న రీతిలో రోడ్లను ఊడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లను ఊడుస్తున్న మాదిరిగానే 2024 ఎన్నికల్లో వైసిపిని ఊడ్చేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, టిడిపి బిసి సాధికారిత కమిటీ రాష్ట్ర డైరెక్టర్ కట్టా రాంబాబు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబును రాజకీయ కుట్రలో భాగంగా అరెస్టు చేశారని, దీనికి నిరసనగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ సారథ్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 23వ రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చూడకు అంటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని, చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని అన్నారు. ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి జగన్‌కు భయం పట్టుకుందని తెలిపారు. జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్కంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మచ్చలేని మహానాయకుడు చంద్రబాబు నాయుడు అని టిడిపి నాయకులు అన్నారు. గురువారం ముత్యాలపల్లిలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ముందుగా గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, పెంటయ్య, మూలా స్వామి, నాగేశ్వరరావు, సాయిబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శిబిరంలో రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. జగన్ ఓటమి భయంతో చంద్రబాబుతో సహా టిడిపి నాయకులందరిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. శెట్టిబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు బొక్క సూరిబాబు మాట్లాడారు. కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షల్లో శ్రీకృష్ణ యాదవ్ సంఘం నేతలు కూర్చున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు తనకు 33 సంవత్సరాల పాటు ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించారని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. ఆయన రాజమండ్రిలో నారా భువనేశ్వరిని కలిసి మద్దతు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులుగా, జెడ్‌పిటిసి సభ్యులుగా, జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా, రెండు సార్లు ఎంఎల్‌సిగా అవకాశం కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు పాల్గొన్నారు.


ఉండిలో..


భువనేశ్వరిని కలిసిన అంగర

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పురుషోత్తం


కలెక్టర్‌ను కలిసిన పురుషోత్తం

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర శాలివాహన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎం.పురుషోత్తం కలెక్టర్ పి.ప్రశాంతిని భీమవరం కలెక్టరేట్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టరుతో మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి కమ్యూనిటీ ప్రజలందరూ నవరత్నాలు పొందుతు న్నారని, ఆ కమ్యూనిటీ ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జివిఎస్‌కె.గణపతిరావు, శాలివాహన కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, పెనుగొండ లక్ష్మి, సఖినేటిపల్లి ఉమామహేశ్వరరావు, యర్రవరపు రామకృష్ణ, పెనుగొండ లక్ష్మి ఉన్నారు.



ఈ సత్కారం మరువలేను

సిబిఐ ఎఎస్‌పి పెద్దిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వృంగవృక్షం గ్రామస్తులు తనను సత్కరించిన విధానాన్ని జన్మలో మర్చిపోలేనని సిబిఐ (న్యూఢిల్లీ) ఎఎస్‌పి బండి పెద్దిరాజు అన్నారు. ఎసిబిలో సైబర్ క్రైమ్ డిపార్ట్మెంట్లో డిఎస్‌పిగా పనిచేస్తున్న శృంగవృక్షం గ్రామం బంటుమిల్లికి చెందిన బండి పెద్దిరాజుకు ఇటీవల ఎఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. శృంగవృక్షం గ్రామ ఆర్యవైశ్య సంఘం, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యం సూర్య ప్రకాష్‌రావు అధ్యక్షతన పెద్దిరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బండి పెద్దిరాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల మాట బిడ్డలు వినగలిగినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని, దానికి ఉదాహరణ తానేనని చెప్పారు. తల్లిదండ్రులను ఆదరించిన వాడు ఎప్పటికీ ఉన్న స్థాయిలోనే నిలబడతాడన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుండి అడిషనల్ ఎస్‌పి స్థాయికి చేరానని తెలిపారు. శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం, గ్రామాభివృద్ధి కమిటీలు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆయనను సత్కరించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బహుజన కులాల నాయకులు చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ పెద్దిరాజులా ఓర్పు , సహనం, కృషి, పట్టుదల ఉన్ననాడే మనిషి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. కులవృత్తులు కూడు పెట్టే రోజులు పోయాయని, వ్యాపారాలు చేసుకుంటే అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, సర్పంచి జంగం సూరిబాబు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - ఉండి

మహదేవపట్నంలో నరసాపురం పార్లమెంట్ సభ్యులు కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఎంపీ నిధులతో నిర్మించనున్న పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు ఎంపీ 15 లక్షల రూపాయల నిధులు కేటాయించి గ్రామాభివృద్ధికి సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, ఎంపిటిసి బొక్కా వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

8న గురువులకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గురు పూజోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక రామచంద్ర గార్డెన్స్‌లో ఉపాధ్యాయ దంపతులను సత్కరించనున్నట్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు.

ముగ్గురు యువగళం కార్యకర్తల అరెస్టు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా గత నెలలో భీమవరంలో జరిగిన టిడిపి, వైసిపి పరస్పర దాడుల నేపథ్యంలో అరెస్టుల పరంపర నేటికీ కొనసాగుతోంది. నాటి గొడవల్లో మరో ముగ్గురు యువగళం కార్యకర్తలను గురువారం పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజపర్చారు. గత నెల 5వ తేదీన లోకేష్ యువగళం పాదయాత్ర వంతెన సమీపంలోకి వెళ్లిన సమయంలో టిడిపి, వైసిపి కార్యకర్తల పరస్పర రాళ్లదాడి ఆ సమయంలో టిడిపి, వైసిపి కార్యకర్తలతో పాటు పోలీసులు కూడా గాయపడ్డారు. దీంతో పోలీసులు యువగళం కార్యకర్తలతో పాటు టిడిపి నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాత్రికి రాత్రే యువగళం టీం నిద్రిస్తున్న సమయంలో పోలీసులు వారిపై దాడి చేసి 39 మంది కార్యకర్తలను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించింది. 13 మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నాటి నుండి వారు ముందస్తు బెయిల్ కోసం తమ లాయర్లతో ప్రయత్నాలు కొనసాగించడంతో బుధవారం వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉంటే ఇదే లోకేష్ పాదయాత్రలో ఏలూరు జిల్లా నిడమర్రు మండలం మండలపర్రులో జరిగిన గొడవల్లో మరో ఏడుగురు యువగళం కార్యకర్తలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి బుధవారం బెయిల్ రావడంతో వారిని గురువారం ఉదయం రిలీవ్ చేశారు. అప్పటికే వారు భీమవరం కేసులో ఉన్నారని మరలా అరెస్ట్ చేసి భీమవరం కోర్టుకు తరలించారు. ఈ ముగ్గురికి 14 రోజులు విధించినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. అయితే మరో కొంతమందిపై కేసులు ఉన్నట్లు సమాచారం.

బాధితులకు వసుధ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన, గాయపడిన బాధిత కుటుంబాలకు వసుధ ఫౌండేషన్ గురువారం ఆర్థిక సహాయం అందజేసింది. అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎంవి.రామరాజు చేతుల మీదుగా ఒక్క కుటుంబానికి పదివేల రూపాయలు సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే సుమారు మూడు నెలల క్రితం లారీ ప్రమాదానికి గురైన పాలకోడేరు మండలం గరగపర్రు శివారు ఉప్పరగూడెం చెందిన చింతపల్లి శ్రీనివాస్ మరణించగా అతని భార్య చింతపల్లి ప్రభావతికి, తీవ్ర గాయాలపాలైన చింతపల్లి మాణిక్యాలరావుకు, ఉండి మండలం మహాదేవపట్నం గ్రామ శివారు ఉప్పరగూడెం చెందిన కాలా శ్రీనివాస్‌కు హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు సౌజన్యంతో పదివేల రూపాయల చొప్పున మొత్తం రూ.30,000 అందజేశారు.



సభలో మాట్లాడుతున్న వక్తలు

వృద్ధులను గౌరవించాలి

పాలకొల్లు :విద్యార్థులు వృద్ధులను గౌరవించాలని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో సీనియర్ సిటిజన్స్ పట్ల మన ప్రవర్తన అవగాహన సదస్సు ప్రిన్సిపల్ బి.రాజారత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అందే రంగారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ షేక్ సిలార్, పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మానే నరసింహారావు, సంఘం గౌరవాధ్యక్షులు తిరుమల రాజు పాల్గొన్నారు. వృద్ధుల పట్ల మంచి ప్రవర్తనతో ఉండాలని, బాధ్యతగా ప్రవర్తించాలని, సమాజంలో వృద్ధులను గౌరవంగా చూడాలని, విద్యార్థులకు కోరారు.

కరాటేలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

భీమవరం రూరల్:రాష్ట్ర షోటోకాన్ కరాటే ఛాంపియన్ షిప్-2023లో ఆదిత్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఏలూరులోని బాకో క్యాంప మండపంలో ఇటీవల జరిగాయి. ఈ పోటీల్లో స్థానిక ఆదిత్య స్కూల్ విద్యార్థులు జి.తనిష్క్‌ప్రేమ్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఎం రేవంతకుమార్, ఎస్.కె.ఫయాజ్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారని స్కూల్ డైరెక్టర్ లయన్ డాక్టర్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన స్కూల్ కరాటే మాస్టర్ సాయిబాబును, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగంధర్, కె.సత్యనారాయణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూస్ క్లిక్‌పై దాడులు పత్రికా స్వేచ్ఛను హరించడమే

జిల్లాలోఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి - వీరవాసరం

మీడియారంగపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విషసంస్కృతిని విడనాడాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజనేయులు అన్నారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో మీడియా రంగంపై దాడులను ఖండిస్తూ గురువారం వీరవాసరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మీడియా రంగంపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ నాయకులు ఖండించాలన్నారు. న్యూఢిల్లీలో న్యూస్ క్లిక్ కార్యాలయంపై మోడీ ప్రభుత్వం చేసిన దాడి భావప్రకటనా స్వేచ్ఛ గొంతు నొక్కడమేనన్నారు. ఎటువంటి నేరారోపణలు చేయకుండానే ఉగ్రవాద నిరోధక చట్టం కింద న్యూస్‌క్లిక్ సంస్థ ఎడిటర్ ప్రబీర్‌పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడం



వీరవాసరం : నిరసన తెలుపుతున్న నేతలు

దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు ఎడిటర్ ఎ.అమరయ్య, ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు జబ్బీర్ గుండా రామకృష్ణ, నవీన్, వి.రాధాకృష్ణంరాజు, నాని, ఎస్‌డివి.ప్రసాద్, నెల్సన్, సూర్య, ఎన్.శివ, పి.మోహన్, సాయిబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు : న్యూస్ క్లిక్‌పై ఇడి దాడులు చేసినందుకు నిరసనగా పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు, ప్రజా సంఘాలు గురువారం నిరసన తెలిపాయి. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్.రవిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. మీడియా సభ్యులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎన్‌వి సాంబశివరావు, ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి.వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు మండెల అప్పలరాజు, సరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని బల్లిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జిల్లా కలెక్టరు ప్రశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ క్యాంపు రూమ్‌లు, కంప్యూటర్ డేటా సెంటర్‌ను ఆమె పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ఓపి రిజిస్ట్రేషన్, స్పాట్ రిజిస్ట్రేషన్, ఐటి రూమ్, వైద్యుల కేటాయింపు, ల్యాబ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం, వైద్యుల గదులు, మందుల కౌంటర్, న్యూట్రిషన్ స్టాల్, కంటి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అక్కడకు వచ్చిన పేషంట్లతో కలెక్టరు మాట్లాడారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన వైద్యసేవలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేసి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించడానికి ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు, తహశీల్దార్ సిహెచ్ పెద్దిరాజు, ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



పాలకొల్లు రూరల్: వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మొగల్తూరు:ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యం చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తట గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీలు ప్రదర్శించిన పౌష్టికాహార కేంద్రాన్ని, ఎఎన్ఎంల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచి పడవల సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఎంపిటిసి లింగం ఏసుబాబు, కవురు సీతామాలక్ష్మి, కర్రి ఏసుబాబు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికంగా బలోపేతం చెందాలి

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కొత్తటలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం మహిళా సమైక్య సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న భరోసాతో మహిళలు ఆర్థికంగా మరింత బలపడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ అమ్మఒడి ఆసరా తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన అయ్యేలా తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కర్రి ఏసుబాబు, కౌరు సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర:జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదలకు అందుబాటులో ఉంటుందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. మార్టేరు బసంతిదేవి బాలికల హైస్కూల్ గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, సర్పంచి మట్టా కుమారి, ఉప సర్పంచి కర్రి వేణుబాబు, డాక్టర్ కె.కార్తీక్ పాల్గొన్నారు.

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు అన్నారు. చెరుకువాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సర్పంచి కొండవీటి సాంబశివరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్ష ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత, జగనన్న ఆరోగ్య సురక్ష మండల కన్వీనర్ బులుసు వెంకట రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానికులు వినియోగించుకోవాలని ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి అన్నారు. గురువారం సిహెచ్ అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సభకు గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు అధ్యక్షత వహించారు. సభలో జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్థానికులకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తోందన్నారు. శిబిరంలో 306 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి, పిప్పర పిహెచ్‌సి డాక్టర్ తహశీల్దార్ పి.లక్ష్మి, ఇఒపిఆర్‌డి వి వి . స త్య నా రా య ‌ ణ పాల్గొన్నారు.

ఆచంట : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని వైసిపి ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. గురువారం కోడేరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ రంగనాథరాజు పాల్గొని మాట్లాడారు. పేదలు ఆరోగ్యంగా జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ప్రతి గ్రామంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు సీతారాం, చంటి, విజయలక్ష్మి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పెనుగొండ : జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట వరమని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని నడిపూడి. చింతలపాలెం ఎంపియుపి స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజలను పూర్తి ఆరోగ్యవంతులుగా చేయడమే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి ఇంటి ముందుకే వైద్యాన్ని అందించడానికి వినూత్నంగా, దేశానికి దిక్సూచిగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని తెలిపారు. సిద్ధాంతం పిహెచ్‌సి డాక్టర్ బి.పావని, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ ఉమా శంకర్ 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.కార్యక్రమంలో నడిపూడి గ్రామ సర్పంచి కడలి బేబీ అన్నపూర్ణ, ఎంపిపి పుతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), కేశవరపు గణపతి, నడిపూడి పూరీల శ్రీను పాల్గొన్నారు.

వీరవాసరం : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రాయకుదురులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గురువారం ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణం లోతట్టుగా ఉన్నందున దాన్ని మెరక చేయాలంటూ పలువురు ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గెడ్డం భారతి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు పాల్గొన్నారు.




మొగల్తూరు : మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

నాణ్యమైన విత్తనాలు రైతులే పండించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి రైతూ తమ విత్తనాన్ని తామే పండించుకోవడం వల్ల ప్రభుత్వ సంస్థలపై ఒత్తిడి తగ్గడమే గాక, నాణ్యమైన విత్తనాన్ని రైతులే స్వయంగా పండించుకునే అవకాశం ఉంటుందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి అన్నారు. గురువారం పరిశోధనా స్థానంలో రబీ విత్తన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ పరిశోధనా స్థానం నుంచి విడుదల చేసిన ఎంటియు 1318, ఎంటియు 1271 రకాలు రైతుల మన్ననలు పొంది రాష్ట్రంలో అధిక విస్తీర్ణంలో సాగుచేయబడుతున్నాయని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త (వరి) టి.శ్రీనివాస్ మాట్లాడుతూ మంచి విత్తనం మంచి భూమిలో వేస్తే మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు విత్తనాలను చేరువచేయడానికి వీలుగా ప్రతి రైతుకూ కొద్ది మొత్తంలో మూల విత్తనాన్ని పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు కేవలం విత్తనాన్ని పండించడమే గాక దాన్ని మార్కెట్ చేసుకోవడంలో కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. భారత ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ ప్లాట్ ఫాం (మార్కెట్ మిర్చి కాం)లను వినియోగించుకొని, తమ విత్తనాలను అధిక ధరలకు విక్రయించి మంచి నికరాదాయం పొందొచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తలు, రైతుల ముఖాముఖి కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. అభ్యుదయ రైతు నెక్కంటి సుబ్బారావు, ఆచంటకు చెందిన రైతులు మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం స్వర్ణోత్సవాల సందర్భంగా స్వర్ణ రకాన్ని విడుదల చేయడం జరిగిందని, ఆ రకం ఇప్పటికీ దేశంలోనే గాక, ఇతర దేశాల్లో కూడా తన సత్తా చాటుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త (వరి) డాక్టర్ ఎ.ఆనంద్‌కుమార్, డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్, భువనేశ్వరి రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం నెక్కంటి సుబ్బారావు , ఆచంట గ్రామానికి చెందిన భూపతిరాజు హరనాధరాజు, ఉండి జగదీశ్వరరావు, వదలికి చెందిన నెక్కంటి రామకృష్ణ, ఆచంటపాలెం గ్రామాలకు చెందిన రైతులను వారు సాధించిన ప్రగతికి గుర్తింపుగా జ్ఞాపికతో సత్కరించారు.



రైతులను సత్కరిస్తున్న ఎడిఆర్ డాక్టర్ భరత లక్ష్మి

సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యమని ఆ విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. జల జీవన్ మిషన్‌లో మోగల్లుకు మంజూరైన రూ.60 లక్షలతో నిర్మించనున్న ఒహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం, పైప్ లైన్లు ఏర్పాటు కు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకంలో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. వైసిపి యూత్ విభాగం అధ్యక్షులు పెనుమత్స వెంకట్రాజు (బాబు) మాట్లాడుతూ మోగల్లు గ్రామాభివృద్ధికి పివిఎల్ ప్రత్యేక నిధులు కేటాయించి ఎంతో సహాయసహకారం అందిస్తున్నారన్నారు.



ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పివిఎల్

ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి పెనుమత్స సీతారామరాజు (సీతయ్య), ఎంపిటిసిలు కాటూరి శాంతకుమారి, పెనుమత్స వెంకటలక్ష్మి, మంతెన బాపిరాజు, జాలే సునీత పాల్గొన్నారు.

అవగాహన కల్పించాల్సిందే

మోగల్లు అతిపెద్ద గ్రామమని, ఇక్కడ జనాలు తక్కువ వచ్చారని, అవగాహనా లోపమా లేక పబ్లిసిటీ చేయకపోవడమా ఒకసారి ఆలోచన చేయాలని డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు అన్నారు. మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పివిఎల్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తుంటే అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి మురళి గంగాధర్‌రావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, సిపి యూత్ విభాగం అధ్యక్షులు పెనుమత్స వెంకట్రాజు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - ఉండి

వెలువర్రు గ్రామదేవత వీర పేరంటాలమ్మవారి హుండీ లెక్కింపును దేవాలయ పరిపాలన అధికారి ఎంవి.నరసింహరాజు సమక్షంలో ఆలయ ఛైర్మన్ మంతెన రంగరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ మంతెన రంగరాజు మాట్లాడుతూ నాలుగు నెలలు కాలంలో అమ్మవారి ఆలయాన్ని యాత్రికులు దర్శించి అమ్మవారికి సమర్పించిన కానుకలు లెక్కించగా 2,82,599 రూపాయల నగదు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణి కిషోర్, ముదునూరి వీర్రాజు, శివరామరాజు, ఎం.రామకృష్ణ, భవాని, గోపి పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - వీరవాసరం

పత్రికా విలేకర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎపి డబ్ల్యూజెఎఫ్ పని చేస్తోందని ఎపి డబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆంజనేయులు అన్నారు. జిల్లా సన్నాహక సమావేశాన్ని గురువారం వీరవాసరం నిర్వహించారు. ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర నాయకులు నవీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమాఖ్య చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సంఘటితం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. పారదర్శకమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ ఆదర్శంగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వి.రాధాకృష్ణంరాజు, నాని, ఎస్‌డివి ప్రసాద్, నెల్సన్, సూర్య, ఎన్.శివ, పి.మోహన్, గుండా రామకృష్ణ, సాయిబాబును కమిటీగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు ఎ.అమరయ్య, వేంద్ర శివప్రసాద్, శంకర్రావు, జబ్బీర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకర్లు పాల్గొన్నారు.

సీసలిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

సీసలిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీసలికి చెందిన కట్రేడ్డి రామచంద్రరావు, పెదకాపవరంకు చెందిన మొగళ్ల చంద్రశేఖర్, రాజమండ్రికి చెందిన నామాన వంశీ, బొండాడకు చెందిన చెరుకువాడ జగన్నాధరావు, కాళ్లకు చెందిన బండారు వెంకట సత్యనారాయణ తదితరుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. సీసలిలోని సాయిబాబా ఆలయానికి శాశ్వత అన్నదానానికి అదే గ్రామానికి చెందిన కట్రేడ్డి రామచంద్రరావు, వరలక్ష్మి దంపతుల కుమార్తె కృష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా లక్షా 5 వేల రూపాయలు విరాళం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి వారిని సత్కరించారు.

పాలకొల్లులో 'ఓయ్ ఇడియట్ 'చిత్రం ప్రదర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నుంచి ఎందరో సినీ కళాకారులు దేశ వ్యాప్తంగా పేరుపొందారని, తాను ఈ చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నానని సినీహీరో యశ్వంత్ చెప్పారు. గీతా అన్నపూర్ణ థియేటర్లో ఓయ్ ఇడియట్ చిత్రాన్ని గురువారం ప్రదర్శించారు. పాలకొల్లుకు చెందిన నిర్మాత పుల్లేటి శ్రీనుబాబు పాల్గొని మాట్లాడారు. పాలకొల్లులో చిత్ర ప్రదర్శన జరగడం ఆనందదాయకమన్నారు. ఇది విలువలతో కూడిన మెసేజ్ ఓరియంటెడ్ చిత్రమని, కుటుంబ సమేతంగా చూడదగ్గ మంచి కుటుంబ చిత్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల విద్యాసంస్థల డైరెక్టర్ రాఘవరెడ్డి, ప్రముఖులు చుండూరి శ్రీరంగ నాయుడు, తులా రామలింగేశ్వరరావు, ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి, ఎస్ఐ మద్దాల శివాజీ,డా ముచ్చర్ల సంజయ్, పెనుమాక రామ్మోహన్ పాల్గొన్నారు.